ఘనంగా ఈద్-ఉల్-ఫితర్

- ఈద్గాల వద్ద ముస్లిం సోదరుల ప్రత్యేక ప్రార్థనలు
- రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ అధికారులు

సైదాబాద్ : ఉజాల-షా ఈద్గా మైదానంలో ప్రార్థనలు చేస్తున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, ముస్లింలు



మలక్‌పేట: సలీంనగర్ ఈద్గా నిండిపోవడంతో గల్లీలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

కందుకూరు : దాసర్లపల్లిలో ..

సైదాబాద్, మార్చి 31: ఈద్-ఉల్- ఫితర్ (రంజాన్) పండుగను ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సైదాబాద్‌లోని ఉజాల-షా ఈద్గా మైదానంలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. సైదాబాద్, అక్బర్‌బాగ్, మాదన్నపేట, చంచల్‌గూడ తదితర ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు భారీగా తరలి వచ్చారు. మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల,అక్బర్‌బాగ్, చావుని డివిజన్ల కార్పొరేటర్లు మినాజుద్దీన్, సలాం షహీద్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కాంతిలాల్ సుభాశ్ పరిశీలించారు. ప్రార్థన అనంతరం ముస్లిం సోదరులు పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలకు పోలీసు అధికారులతో పాటు, స్థానికులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సైదాబాద్‌లో ఈద్ మిలన్

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్ మిలన్‌ను సైదాబాద్‌లోని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ హైదరాబాద్ చాప్టర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఈద్ మిలన్, సర్వమత సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మౌల్వీ హమీదుల్లా హసన్ అధ్యక్షత వహించగా హిందూ, క్రైస్తవ, బ్రహ్మకుమారీలు, బౌద్ధ మతాలకు చెందిన ఆధ్యాత్మిక ప్రతినిధులు, పోలీస్‌అధికారులు,న్యాయవాదులు, ప్రొఫెసర్లు, వివిధ రంగాల ప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు తన్వీర్ అహ్మద్, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ షకీల్ అహ్మద్, ఈస్ట్‌జోన్ అదనపు డీసీపీ రాందాస్ తేజావత్, సెయింట్ లుక్స్, హిందుస్తానీ చర్చి ఇన్‌చార్జి శ్యామ్యూల్ హెరాల్డ్, బౌద్ధమత ప్రతినిధి సుధీర్ బారువా, డాక్టర్ వరప్రసాద్, డీఆర్‌డీఎల్ శాస్త్రవేత్త, యాదగిరి పాల్గొన్నారు.

పహాడిషరీఫ్ : చిన్నారులతో డీసీపీ సునీతారెడ్డి

ఈద్ మిలాన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కందుకూరు మండలంలో..

కందుకూరు : మండలంలో రంజాన్ పండుగను సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లింలు కొత్త బట్టలు ధరించి ఈద్గాలు, మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కందుకూరు, కొత్తగూడ మహమ్మద్‌నగర్, దెబ్బడగూడ, దాసర్లపల్లి, నేదునూరు, బాచుపల్లి, లేమూరు, బైరాగిగూడ, బేగంపేట్, అగర్‌మియాగూడ, సరస్వతీగూడ గ్రామాల్లో రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు సీఐ సీతారామ్, ఎస్సై సైదులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు ఈద్గాలు, మసీదుల వద్దకు వెళ్లి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

మలక్‌పేట : నియోజకవర్గంలోని మూసారాంబాగ్, పాత మలక్‌పేట, ఆజంపుర డివిజన్లలో ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. సలీంనగర్ ఈద్గా వద్ద వేలాదిమంది ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా నిండిపోవడంతో ఈద్గా రోడ్లపై ప్రార్థనలు చేశారు. అనంతరం పక్కనే ఉన్న ఖబరస్థాన్‌కు చేరుకొని పూర్వీకుల సమాధుల వద్ద నివాళులర్పించారు. ఒకరినొకరు ఆత్మీయ ఆలింగనాలు చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాకు వెళ్లే దారులను భారీకేడ్లతో మూసివేసిన మలక్ పేట పోలీసులు, ప్రార్థనలకు వెళ్లే ముస్లింలను మాత్రమే లోనికి అనుమతించారు. మలక్ పేట ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ నరేశ్, డీఐ ఆంజనేయులు బందోబస్తును పర్యవేక్షించారు.

ఆర్కేపురం డివిజన్‌లో..

ఆర్కే పురం : ఆర్కే పురం, సరూర్‌నగర్, బడంగ్‌పేట్, మీర్‌పేట్, మహేశ్వరం, తుక్కుగూడలో సోమవారం రంజాన్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరినొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

బాలాపూర్ ఉద్గాలో..

పహాడిషరీఫ్ : బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఈద్-ఉల్-ఫితర్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక రోషన్ ఉద్దౌలా ఈద్గాకు నగరం నలుమూలల నుంచి వేలాదిగా తరలి వచ్చిన ముస్లింలు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా డీసీపీ సునీతారెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

అత్యంత సున్నిత ప్రాంతాలను ముందస్తుగా గుర్తించి పోలీసులను మోహరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులకు చాక్లెట్స్ పంపిణీ చేశారు.

కందుకూరు : గూడూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మలక్‌పేట : బందోబస్తును పర్యవేక్షిస్తున్న మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్ ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేశ్, డీఐ ఆంజనేయులు

కందుకూరు : మహమ్మద్‌నగర్‌లో సీఐ సీతారామ్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

రంజాన్ పండుగ సోదరభావాన్ని పెంపొందిస్తుంది..

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌బక్షి మసీదులో ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్, మార్చి 31: రంజాన్ పండుగ మానవీయ విలువలను, పరస్పర ప్రేమానురాగాలను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా హయత్‌నగర్‌లోని హయత్ బక్షి మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేతికి బీఆర్ఎస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు మహమ్మద్ రఫీక్ దట్టీ కట్టి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యానాల కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ సాగర్, జగన్మోహన్‌రెడ్డి, మైనార్టీ పెద్దలు సయ్యద్, మహమ్మద్ సలీం, జహంగీర్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేట : మూసారాంబాగ్ డివిజన్ సలీంనగర్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఆర్కేపురం : సరూర్‌నగర్ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

- మన్సూరాబాద్ డివిజన్‌లో..

మన్సూరాబాద్ : మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పలు మసీదుల్లో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు శివచరణ్ రెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

గ్రూప్-1 ఐదో ర్యాంకర్ కృతికకు సత్కారం

బడంగ్‌పేట్, మార్చి 31: గ్రూప్-1లో స్టేట్ ఐదో ర్యాంక్ సాధించిన సిద్ధాల కృతికను మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు జలాల్పూర్ సునీతాబాలరాజ్ సోమవారం ఘనంగా సత్కరించారు. జిల్లెలగూడలోని నివాసానికి వెళ్లి కృతికకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కాగా కృతిక బీఆర్ఎస్ మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షురాలిగా, సరూర్‌నగర్ మండల పరిషత్ అధ్యక్షురాలిగా, జిల్లెలగూడ కార్పొరేటర్‌గా పనిచేసిన సిద్ధాల లావణ్య-బీరప్ప దంపతుల కుమార్తె. కృతిక ప్రస్తుతం కమర్షియల్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. తన కుమార్తె రేయింబవళ్లు చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించిందని తల్లిదండ్రులు సిద్ధాల లావణ్య బీరప్ప సంతోషం వ్యక్తం చేశారు.

లేమూరు హైస్కూల్‌లో హైమస్ట్ లైట్లు ప్రారంభం

కందుకూరు, మార్చి 31 : విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని మండలంలోని లేమూరు మాజీ ఎంపీటీసీ మూల హనుమంత్‌రెడ్డి తెలిపారు. లేమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం రెండు హైమస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం విద్యార్థులు చదువుకునేందుకు, ఆడుకోవడానికి లైట్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాణా ప్రతాప్‌రెడ్డి, యూత్ మాజీ అధ్యక్షుడు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, ఇంద్రారెడ్డి, రహీం, దర్శన్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి భవన్‌లో పంచాంగ శ్రవణం

వనస్థలిపురం, మార్చి 31 : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వనస్థలిపురంలోని గాయత్రి భవన్‌లో బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పంచంగ శ్రవణం నిర్వహించారు. ప్రముఖ పంచాంగ పఠకులు కౌతా సోమయాజులు, డాక్టర్ కుప్పా శ్రీనివాసశాస్త్రి మాట్లాడుతూ.. విశ్వావసు సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారన్నారు. పంటలు బాగా పండుతాయని, పాలకులు ప్రజలకు ఉత్తమంగా సౌకర్యాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయనగర్ అధ్యక్షుడు కుర్మారావు, హనుమంతరావు, బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పింగళి సాంబశివరావు, వెంకన్న, మంగపతిరావు, శ్రీధరరావు, లక్ష్మీనారాయణ, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయినగర్ కాలనీ నూతన కార్యవర్గం

వనస్థలిపురం, మార్చి 31 : హస్తినాపురం డివిజన్ షిర్డీసాయినగర్ కాలనీ నూతన కమిటీని సోమవారం కాలనీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బి.నర్సింహ మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా వి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నాగేశ్‌గౌడ్, కోశాధికారిగా టి.గోవింద్, ఉపాధ్యక్షులుగా అనంతరెడ్డి, వెంకటేశ్వర్లు, నరేశ్‌చారి, సలహాదారులుగా దినకర్‌రావు, దుర్గాదాస్, వెంకటేశ్ గౌడ్, నారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింహ మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీవాసులకు ధన్యవాదాలు తెలిపారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

- సుమారు రూ. 3 లక్షల ఆస్తి నష్టం

హయత్‌నగర్,మార్చి 31 : హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం ప్రమాదవశాత్తు స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ముదిరాజ్‌కాలనీ, పీ అండ్ టీ కాలనీలో అలకాటి ఎల్లయ్య కొంతకాలంగా స్క్రాప్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ప్రమాదవశాత్తు దుకాణంలో అగ్నిప్రమాదం జరగి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకొని ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ. 3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. దుకాణం చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాప్తి చెంది ఉంటే పెను ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు.

శిల్పారామంలో నృత్య ప్రదర్శన

ఉప్పల్, మార్చి 31 : ఉప్పల్ శిల్పారామంలో ఉగాది వసంతోత్సవాల సందర్భంగా నార్తరజ ఆర్ట్స్ అకాడమీ నాట్య గురువు నిహారిక శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. పుష్పాంజలి, శ్లోకాలు, అలరిపు, స్వాగతం కృష్ణ, ఆనంద నర్తన, మురుగన్ కౌతం, ఇదిగో భద్రాద్రి, నమశ్శివాయతేయ్, శ్రీ విజ్ఞ రాజాం భజే, అదిగో అల్లదిగో, ఏకదంతాయ, భోశంభో, అయిగిరినందిని, గరుడ గమన,స్వరజతి, రామకోదండ రామ, నటేశకౌతం, నంది చొల్,తందనాన, శివ పంచాక్షరీ, రామచంద్ర మంగళం అంశాలను కళాకారులు ప్రదర్శించారు. కార్యక్రమంలో వాగ్దేవి, రిత్విక, వినీషే, రిషిక, అడవిత, నేత్ర, హరిప్రియ, వర్ష,గౌరీ, మయూరి, తరుణి, అనన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపడతాం : ఎమ్మెల్యే

నీఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలో సంక్షేమ సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 31: భవిష్యత్ తరాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ మీదుగా సుష్మ థియేటర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడతామని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి నీఆర్ ఎన్‌క్లేవ్‌లో జీహెచ్ఎంసీ నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన సంక్షేమ సంఘం భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో త్వరలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తానన్నారు. మురుగునీటి సమస్య పరిష్కారం కోసం త్వరలో కాలనీ డ్రైన్‌ను కేవీఆర్ కన్వెన్షనల్ వద్ద ఉన్న ట్రంక్ లైన్‌కు అనుసంధానం చేయిస్తానని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యనూ పరిష్కరిస్తామన్నారు. వనస్థలిపురంలోని బిజేస్ గ్రౌండ్ క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలనీ ముఖద్వారం తోపాటు పార్కు లేన్ అభివృద్ధికి సహకరించిన డి. లింగారెడ్డి, ఎన్. శ్రీనివాస్‌రెడ్డిని ఎమ్మెల్యే సన్మానించారు.

కొలను శివారెడ్డికాలనీలో స్విమ్మింగ్ పూల్ ప్రారంభం

హయత్‌నగర్ పరిధి కొలనుశివారెడ్డికాలనీ ప్రధాన మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాల్ఫిన్ ఇండోర్ స్విమ్మింగ్ పూల్‌ను సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు మహేందర్ రెడ్డి, ప్రకాశ్‌రెడ్డిని అభినందించారు.

కార్యక్రమాల్లో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, కాలనీ అధ్యక్షుడు భిక్షం రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహారెడ్డి, కోశాధికారి రాజేందర్, కాలనీవాసులు సుందర్ విజయభాస్కర్, జగన్మోహన్ రావు, రవీందర్ రావు, కరుణాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జగదీశ్‌యాదవ్, నాగరాజు, రఘువీర్‌రెడ్డి, నరసింహగౌడ్, సంతోష్ కుమార్, బొక్క నరసింహారెడ్డి, కాలనీ అధ్యక్షుడు కొలను నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర లేక టమాట రైతు విలవిల!

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు
- కూలీ, ఆటో ఖర్చులు వెళ్లక టమాట పంటను చేనులోనే వదిలేస్తున్న రైతులు
- సరైన ధర అందించాలని ప్రభుత్వానికి వేడుకోలు

కందుకూరు మండలంలో రైతు చేనులో వదిలేసిన టమాటాలు

కందుకూరు, మార్చి 31 : పంట ఏదైనా అష్ట కష్టాలు పండించి తీరా మార్కెట్ తీసుకెళ్తే గిట్టుబాటు ధర అందక రైతన్నలు డీలా పడుతున్నారు. వేసవి నీటి ఎద్దడి నేపథ్యంలో వరికి బదులుగా కూరగాయల సాగు వైపు మొగ్గు చూపిన రైతులు ఇప్పుడు సరైన ధర లేక కుదేలవుతున్నారు. మార్కెట్లో ధరలు పడిపోవడంతో దళారులు కిలో టామాట ఐదు రూపాయలకు మించి ఇవ్వడం లేదని పలువురు కూరగాయల రైతులు వాపోతున్నారు. దాంతో పెట్టుబడులు అటుంచి, పంట కోస్తే కూలీల ఖర్చులు కూడా వెళ్లక పొలంలోనే పంటను వదిలేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని కొత్తగూడ, కందుకూరు, జైత్వారం, నేదునూరు, గ్రామాల్లో రైతులు ఎక్కువగా టమాట పండిసున్నారు. కాగా నెల రోజుల క్రితం టమాట ధర మార్కెట్లో రూ. 30 వరకు పలికింది. ప్రస్తుతం ధర అమాంతం పడిపోయింది. ఈ నేపథ్యంలో రైతుల వద్ద దళారులు మాత్రం కేవలం ఐదు రూపాయలకే కిలో టమాట కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పంట కోసి మార్కెట్‌కు తరలించాలంటే కూళ్లు, రవాణా ఖర్చులు సరిపోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోసి బాక్సుల్లో ఆటోలో తరలిస్తే ఒక బాక్స్‌కు రూ. 100 రావడం లేదని ఆందోళన చెందుతున్నారు. తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర రావడంలేదని ఈ విషయంలో ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం టమాట పండించే రైతులకు గిట్టుబాటు ధర అందించాలని కోరుతున్నారు.

'ప్రేమంటే ఇదేనా' సందేశాత్మక నాటిక ప్రదర్శన

మల్లాపూర్, మార్చి 31: రాష్ట్ర చలన చిత్ర టీవీ నాటక రంగ అభివృద్ధి సంస్థ రాధా ఆర్ట్స్ అసోసియేషన్ సౌజన్యంతో 'ప్రేమంటే ఇదేనా' నాటిక ప్రదర్శన సోమవారం నెహ్రూనగర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. రక్త కన్నీరు నాగభూషణం, బళ్లారి రాఘవ అవార్డు గ్రహిత మాడుగుల కృష్ణమోహన్ రచననటన, దర్శకత్వం వహించిన ఈ నాటిక ప్రదర్శనలో నటీ నటులు తమ నటనతో చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నటీ నటులు.. జగపతి, ప్రసాద్ పాత్రలో మాడుగుల కృష్ణమోహన్, రంగస్థల టి.వి నటుడు ధనుంజయ పాత్రలో ఐరేని రమేష్‌గౌడ్, నట చంద్రకళ, సహజనటి జి. మనుప్రియ, గోపాలకృష్ణ, జంగయ్యగౌడ్, ఏవీబీవీ రాయలు, నాగరాజ్‌లు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడు జగదీశ్వర్‌రావుకు సన్మానం

వనం జగదీశ్వర్‌రావును సన్మానిస్తున్న వక్తలు

సైదాబాద్, మార్చి 31: సామాజిక సేవకుడిగా 22 ఏళ్లుగా సేవలందిస్తున్న సైదాబాద్ హౌసింగ్ బోర్డ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి వనం జగదీశ్వర్‌రావును ఉగాది పండుగను పురస్కరించుకొని కాన్ఫడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సైదాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సైదాబాద్ కాలనీలోని రామాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొండపల్లి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా వనం జగదీశ్వర్‌రావు చేస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక, ధార్మిక, సాంఘిక సేవా కార్యక్రమాలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో సైదాబాద్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. రఘునాథ్, కాన్ఫిడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్, చీఫ్ కోఆర్డినేటర్ ఎం. సూర్యనారాయణ, చైర్మన్ రాజేంద్రప్రసాద్, శ్రీనివాసచార్యులు, శ్రీనాథాచార్యులు, సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కురుమల ఐక్యతకు కృషి చేయాలి

ఉప్పల్, మార్చి 31: కురుమ సంఘం ఎన్నికల్లో అంతా ఐక్యంగా ఉండి రాష్ట్ర ఎన్నికల్లో పాల్గొనుటకు కురుమ కులస్తులందరూ సంఘ సభ్యత్వం చేయించాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షులు గొరిగే రమేశ్ కోరారు. ఉప్పల్ జోన్ కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప స్వామి ఆలయంలో సోమవారం కురుమ సంఘం సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించారు. గొరిగే బక్కయ్య కురుమ జ్ఞాపకార్థంగా రాష్ట్ర కురుమ సంఘం కార్యదర్శి ప్రముఖ హైకోర్టు న్యాయవాది గొరిగే మల్లేశ్ కురుమ కంప్యూటర్‌ను బహూకరించారు. ఈనెల 3న దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.